**జరిగిన కథ :** కాశీమజిలీల్లో ప్రస్తుతం సప్తమిత్ర చరిత్రలో ఉన్నాం. కాళిదాస మహాకవి రచించిన మేఘసందేశం లోని యక్షుడు కూడా ఒక ప్రధాన పాత్రగా.. ఏడుగురు మిత్రుల మధ్య ఈ కథ నడుస్తుంది. వివిధ నగరాల నుంచి ధారానగరానికి బయల్దేరిన మిత్రుల మధ్య జరిగిన కథలో చివరిభాగం ఇది.






# మిత్ర సమ్మేళనం

అనుసృజన: నేతి సూర్యనారాయణ శర్మ

ఘోటకముఖుడు తన కథ చెబుతున్నాడు.

..అలా తన భార్య అయిన మిత్రవింద చేత ప్రబోధింపబడిన చక్రధర నాయకుడు.. భోజనం తరువాత నన్ను కచేరీ చావిడికి తీసుకువెళ్లాడు. అక్కడ విపులుని నగరం నుంచి చక్రధరుడు వెంటబెట్టుకుని తెచ్చిన వేశ్యాపుత్రికలు ఉన్నారు.

మమ్మల్ని చూడటంతోనే లేచి నిలబడ్డారు.

''అమ్మాయిలూ! మీరెవరో, ఎక్కడినుంచి వచ్చారో వివరంగా చెప్పండి. మీ స్వస్థానానికి మిమ్మల్ని చేర్చే పూచీ నాది'' అన్నాడు చక్రధర నాయకుడు.

''మహారాజా! మాది పాటలీపుత్రం. మేము రతినూపుర అనే వేశ్యపుత్రికలం. నా పేరు చిత్రసేన, దీనిపేరు రతిమంజరి. నా భర్త దత్తుడనే విద్వాంసుడు. దీని భర్త గోణికాపుత్రుడు. మేము తల్లి సంపదలను, గుణాన్నీ వదిలేశాం. మగనాలులుగా మారిపోయాం. గోణికాపుత్రుని వెంట దత్తుణ్ని కలుసుకోవడానికి ధారానగరం వెళ్తుండగా.. ఒక మతంగ యోగిని మా వెంట పడింది. 'మేం వేశ్యాధర్మాలను విడిచిపెట్టాం' అని ఎంత చెప్పినా వినలేదు. చివరికి ధారానగరం నుంచి ఒక బండిలో మమ్మల్ని బలవంతంగా తీసుకుపోయి, విపులుడనే మహారాజు చెంతకు చేరింది. వెలయాలికి నీతి ఎక్కడిదని ఆ మహారాజు మమ్మల్ని ఈసడించాడు. అయినా మేము మా వ్రతాన్ని విడిచిపెట్టలేదు. ఇంతలో అతగాడు మిమ్మల్ని ఎందుకో పిలిపించాడు. మీవెంట పంపాడు. ఇదీ జరిగింది'' అని చిత్రసేన చెప్పడం పూర్తి చేసింది.

ఆ మాటతో నాకు మేను ఉప్పొంగింది.

నేను చక్రధర నాయకుడితో..

''రాజా! ఈ గణికల భర్తలు నాకు ప్రాణస్నేహితులు. ప్రస్తుతానికి వారు ధారానగరంలో ఉన్నారు. వీళ్లను తమ భర్తలతో కలిపే బాధ్యత నాకు అప్పగించండి. నేను తీసుకువెళ్తాను'' అని కోరాను.

''అంతకంటే కావాల్సింది ఏముంది? మీకు కావాల్సినన్ని రోజులు ఇక్కడ విశ్రాంతి తీసుకుని బయల్దేరవచ్చు'' అని సెలవిచ్చాడు చక్రధరుడు.

నేను ఒకనాడు చక్రధరుని ఇల్లాలు మిత్రవిందతో.. ఆమెను పరమ పతివ్రత, దత్తభాగవతంలో గొప్ప వైరాగ్యభోధ చేసిన మహాతల్లి అయిన మదాలసతో పోల్చాను. మదాలస చరితాన్ని ఆమె మనసుకు ఆనందం కలిగేలా చెప్పాను. దాంతో పరోక్షంగా త్వరలో నీకు పుత్రసంతానం కలగాలి! అని కథాశ్రవణ ఫలరూపంగా ఆశీర్వదించినట్లయింది.

వారు ఆ కథ విని ఆనందిస్తున్న సమయంలో.. ముసలావిడతో నా మనోభీష్టాన్ని తెలియచేశాను. దానికి చక్రధర నాయకుడు, మిత్రవింద సైతం ఆమోదించారు. సుముహూర్తం చూసి, వారి కుమార్తె అయిన జాంబవతిని నాకిచ్చి పెళ్లి చేశారు. కొంతకాలం ఆమెతో సుఖించిన తరువాత, నాకు మిమ్మల్ని కలుసుకోవాలనే సంగతి జ్ఞాపకం వచ్చింది. చిత్రసేనను, రతిమంజరిని వెంటబెట్టుకుని ఇలా వచ్చేశాను. మీరున్న చోటు తేలికగానే తెలుసుకోగలిగాను. ఇదీ జరిగింది.

* * *

..అని ఘోటకముఖుడు తన కథను పూర్తి చేశాడు.

''మిత్రమా! నీకొక సంగతి చెప్పనా?'' అని అడిగాడు గోణికాపుత్రుడు.

''ఏమిటీ!?'' అని ఘోటకముఖుడు ఆశ్చర్యంగా చూస్తుండగానే..

''ఇంతకాలం నుంచి ఏ మహాసాధ్విని రక్షించడానికి నువ్వు ప్రయత్నించావో ఆ లీలావతి.. ఇప్పుడిక్కడే ఉంది'' అని పూర్తి చేశాడు.

''మిత్రమా! ఇంకో ఆశ్చర్యం కలిగించే సంగతి చెప్పనా?'' అన్నాడు సువర్ణనాభుడు.

మధ్యలోనే గోణికాపుత్రుడు అందుకుని..

''నువ్వు ఇంతకాలం ఏ పెద్దమనిషికి సహకరించి, ఈ లీలావతిని ఆయనతో కలపాలని ప్రయత్నించావో.. ఆ పెద్దాయన మరెవరో కాదు.. సాక్షాత్తూ భోజ మహారాజు'' అని చెప్పాడు.

ఘోటకముఖుడికి మరింత ఆనందం కలిగింది.

చారాయణుడు కొనసాగిస్తూ..

''నన్ను గాడిదగా చేసిన భైరవుడే భోజ మహారాజును, ఆయన భార్య లీలావతిని కూడా జంతువులుగా మార్చాడు. భోజులవారు వాడి బారినుంచి కాళిదాసు చాతుర్యంతో తప్పించుకున్నారు. మహారాణి లీలావతి కూడా ఇదిగో.. ఈ సువర్ణపదిక వల్ల తన పూర్వరూపానికి రాగలిగారు'' అని చెప్పాడు.

మిత్రుల మధ్య ఆ మాటలు జరుగుతుండగా, మేలిముసుగు మాటున లీలావతి వారి వద్దకు వచ్చింది. ఘోటకముఖునికి నమస్కరించింది.

అతడు సంతోషించాడు.

''ఇంతకూ మన దత్తకుడేమయ్యాడు?'' అని ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నకు సువర్ణనాభుడు సమాధానమిచ్చాడు.

''ఒక యక్షుని శాపం వల్ల మన దత్తకుడు స్త్రీగా మారాడు. ఏడాది తరువాత తన పూర్వరూపానికి వచ్చాడు. కానీ, శాపావశాన్ని చెబుతూ యక్షుడు పెట్టిన నియమాన్ని మరిచిపోయి, మళ్లీ స్త్రీరూపానికి మారిపోయాడు. నిజానికి వాడెక్కడున్నాడో తెలియదు. కానీ, యువరాజు చిత్రసేనుల వారి ప్రియురాలిగా ఉన్నది వాడేనని కొందరు చెవులు కొరుక్కుంటున్నారు!''.

''ఏమిటీ గందరగోళమంతా.. వాడే అని మనకు